# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ సోమవారం 03 మార్చి 2025 | www.balagamtv.com | పేజీలు 1


## నేడు ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు

**బలగం టీవీ, హైదరాబాద్**

కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల, టీచర్స్ నియోజకవర్గ స్థానాల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడు ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. అందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేసి మాక్ కౌంటింగ్ నిర్వహించారు. రెండు ఎమ్మెల్సీ స్థానాల ఓట్లను కరీంనగర్ లోని అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో లెక్కిస్తారు. మొత్తం 35 టేబుళ్ల ద్వారా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ పమేలా సత్పతి ప్రకటించారు. ఒక్కో టేబుల్ వద్ద నలుగురు సిబ్బంది విధులు నిర్వర్తించనుండగా, ఇందులో ఒక మైక్రో అబ్జర్వర్, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు లెక్కింపు అసిస్టెంట్లు ఉన్నారు. వారందరికీ సంబంధిత అధికారులు శిక్షణ ఇచ్చారు. లెక్కింపు కోసం మొత్తం 800 మంది సిబ్బందిని వినియోగించనున్నారు. ఇందులో 20 శాతం రిజర్వ్ సిబ్బందిని నియమించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్స్ ఓట్ల లెక్కింపు త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంది. కానీ పట్టభద్రుల ఓట్ల లెక్కింపు పూర్తి కావడానికి రెండు నుంచి మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది పోటీ చేయక 27088 మంది ఓటర్లకు గాను 24968 మంది టీచర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఆ ఓట్ల లెక్కింపు 12 గంటల్లో పూర్తయ్యే అవకాశం ఉంది.

## ఉమ్మడి పాలమూరు రుణం తీర్చుకుంటా

- గత ప్రభుత్వం వల్లే కృష్ణా జలాల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం
- సీఎం రేవంత్‌రెడ్డి
- వనపర్తిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన





**బలగం టీవీ, వనపర్తి**

వనపర్తిలో పుట్టి.. అచ్చంపేటలో పెరిగి.. చదువు, సంస్కృతి నేర్చుకొని, కొడంగల్ నుంచి రాజకీయంగా రాణిస్తున్న తాను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అయ్యానని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉమ్మడి పాలమూరు జిల్లా రుణం తీర్చుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో వనపర్తికి ప్రత్యేక గుర్తింపు ఉందని, కానీ ఐదేండ్ల క్రితం వనపర్తిలో గెలిచిన ఎమ్మెల్యే రాజకీయాలను కలుషితం చేశారని తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో రూ.550 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు.పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రం,మండలాల్లో రూ. 40 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు, నూతన ప్రభుత్వ ఆసుపత్రి భావన నిర్మాణానికి రూ.203.95 కోట్లతో,నూతన ఐటీ టవర్ భవన నిర్మాణానికి 22 కోట్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణాలకు రూ. 47.50 కోట్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు, 30 పడకల ఆస్పత్రి భావనము (పెబ్బేర్) నిర్మాణపు పనులకు రూ. 11.20 కోట్లు, శ్రీరంగాపూర్ ఆలయానికి పర్యాటకంగా అభివృద్ధి పరిచేందుకు 1.5 కోట్లు, వనపర్తి నియోజకవర్గంలో గిరిజన ఆవాసాల అభివృద్ధి పనులకు రూ. 22.67 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పనులకు ముఖ్య మంత్రి శంకుస్థాపనలు చేశారు. దీనితోపాటు కాసిం నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం సమగ్ర సర్వే పనులకు కూడా శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. వనపర్తిలో అనేక విద్యాసంస్థలకు కాంగ్రెస్ ప్రభుత్వాలే పునాది వేశాయన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే 25.50 లక్షల మంది రైతులకు రూ.22 వేల కోట్ల రుణమాఫీ జరిగిందా లేదా గుండెలపై చేయి వేసుకొని చెప్పాలని కోరారు. రూ.7625 కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో వేశామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 16 వేల మెగావాట్లకు పైగా పెరిగినా ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా చూస్తున్నామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటై ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని తెలిపారు. 150 కోట్ల మంది ఆడబిడ్డ లు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చేశారని, దాని కోసం ఆర్టీసీకి రూ.4500 కోట్లు చెల్లించామన్నారు. వనపర్తి సాక్షిగా ఈ రోజు రూ.1000 కోట్ల రుణాలను ఆడబిడ్డలకు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో 65 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయన్నారు. స్వయం సహాయక సంఘాలను ఆదుకునే బాధ్యత తనదేనన్నారు. హైటెక్ సిటీ శిల్పారామం పక్కనే స్వయం సహాయక మహిళల కోసం 150 స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థల పక్కనే మహిళా సంఘాలకు మూడున్నర ఎకరాల స్థలం ఇస్తారని ఎప్పుడైనా ఊహించారా.. అని మహిళల ను ఉద్దేశించి సీఎం అన్నారు. 1000 బస్సులను స్వయం సహాయక మహిళలతో కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా చేశామన్నారు. రాష్ట్రంలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరుతో ఇస్తున్నామన్నారు. పదేండ్లలో నిరుద్యోగ యువతకు కేసీఆర్ ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. కానీ ఆయన కుటుంబంలో అందరికీ ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో పడుకుని ప్రజల గురించి ఆలోచించలేదన్నారు. ఆయనే ప్రాజెక్టులు కడితే పాలమూరు ప్రజలు ఎందుకు వలస పోతున్నారని ప్రశ్నించారు. వలసలు పోతున్న పాలమూరు ప్రజల గురించి కేసీఆర్ ఏనాడైనా ఆలోచించారా అని నిలదీశారు.

నానా కష్టాలు పడి వరంగల్‌కు ఎయిర్ పోర్టు తీసుకువస్తే కిషన్ రెడ్డి తానే తీసుకువచ్చానని చెబుతున్నాడని, తెలంగాణ అభివృద్ధిపై ఇక్కడి బీజేపీ ఎంపీ కిషన్ రెడ్డి సైంధవుడిలా తయారయ్యారని విమర్శించారు. మెట్రో విస్తరణ అనుమతులు, మూసీ నది ప్రక్షాళనకు నిధులు, రీజనల్ రింగ్ రోడ్డుకు అనుమతులు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు నీటి కేటాయింపులు, కాళేశ్వరానికి నీటి కేటాయింపులు రాకుండా కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణకు ఏదైనా వస్తే తన ఖాతాలో వేసుకుంటున్నారని, ఎన్నికల హామీ మేరకు 12 ఏండ్ల మోడీ పాలనలో 24 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలని అన్నారు. మోడీ తెలంగాణలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో కిషన్ రెడ్డి లెక్కపెట్టి చెప్పాలన్నారు. సికింద్రాబాద్‌లో వరదలు వచ్చి కొట్టుకుపోతే కేంద్రం చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదన్నారు. అడుగుదామని చెప్పారు. నిర్మలా సీతారామన్ తమిళనాడుకు మెట్రో తీసుకువెళ్లారని, కేంద్ర మంత్రి శోభా బెంగళూరుకి మెట్రో తీసుకెళ్లారని అన్నారు. సొంత రాష్ట్రం తెలంగాణకు కిషన్ రెడ్డి ఎందుకు మెట్రో తీసుకురావడం లేదని అన్నారు.

## రైతులు గుండె ధైర్యంతో వ్యవసాయాన్ని కొనసాగించాలి

- కేసీఆర్ అంటే కాళేశ్వరం.. కాంగ్రెస్ అంటే శనీశ్వరం.
- కేసీఆర్ మీద కోపం ఉంటే రాజకీయంగా ఎదుర్కో..
- కేసీఆర్ పై కోపం రైతులపై చూపించవద్దు..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రేవంత్ ప్రభుత్వం వచ్చాక నీళ్లేమో పాతాళంలోకి, నిధులేమో ఢిల్లీకి,నియామకాలు ఏమో గాల్లో కలిసిపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని రైతులను కాపాడుకోవడానికి వెంటనే మిడ్ మానేరు నుండి నీళ్లను విడుదల చేయాలని, లేకపోతే అన్నదాతలతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు.ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సిరిసిల్ల ఎమ్మెల్యే సిరిసిల్ల నియోజక వర్గంలో పర్యటించారు.ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో జైలుకు వచ్చిన తంగళ్లపల్లి మండలం జిల్లెళ్లకు చెందిన రైతు అబ్బాడి రాజిరెడ్డిని, సిరిసిల్ల లో ప్రభుత్వ కుట్రతో హెూటల్ ని అకారణంగా మూసివేసిన టీ కొట్టు నిర్వాహకుడు బత్తుల శ్రీనివాస్ని,ఇటీవల మృతి చెందిన బుర్ర శంకరయ్య,సీనియర్ నాయకుడు కాసర్ల మల్లేశం కుటుంబాలని పరామర్శించారు. అనంతరం ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట, దేవుని గుట్ట తండాలో సాగునీరు లేక ఎండిపోతున్న పంట పొలాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ కాళేశ్వరం నుంచి నీళ్లు తీసుకువచ్చి, మల్కపేట రిజర్వాయర్ లో పోస్తే దేవుని గుట్ట తండాలోని రైతులు వ్యవసాయం చేసేవారని, కేసీఆర్ మీద ఉన్న కోపం, ద్వేషంతో మేడిగడ్డ లో జరిగిన కుట్రపూరిత ప్రమాదాన్ని సాకుగా చూపించడంతో రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సిరిసిల్ల ప్రాంతంతోపాటు, ఇతర ప్రాంతాల్లో చాలామంది రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని,కాళేశ్వరం నీళ్లు రాక తుంగతుర్తి ,సూర్యాపేట ,కోదాడ ప్రాంతాల్లోనూ వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. కెసిఆర్ అంటే కాళేశ్వరం,కాంగ్రెస్ అంటే శనీశ్వరమని,ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని అన్నారు.

మేడిగడ్డ పర్రెను రిపేర్ చేసి సాగునీరు ఇవ్వచ్చు అని, కేసీఆర్ మీద కోపంలో మేడిగడ్డను రిపేరు చెయ్యక, రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు అందించడం లేదు అని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిండు వేసవి, ఎర్రటి ఎండల్లో సిరిసిల్ల జిల్లాలోని అప్పర్ మానేరు ను కాలేశ్వరం జలాలతో నింపడంతోముత్తడి దుంకిందని అన్నారు. ఆనాడు మా ప్రభుత్వంలో కా కాలేశ్వరం జలాలతో మిడ్ మానేరు,అప్పర్ మానేరు నింపడంతో ఎర్రటి ఎండల్లో కూడా వాగులు చెరువులను నింపి, పంట పొలాలకు సాగునీరు అందించి రైతులను కాపాడుకున్నమని అన్నారు.

సిరిసిల్ల జిల్లాలో వందల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదు అని, 48 గంటల్లో నీళ్లను వదిలి పెట్టకపోతే మంత్రి ఛాంబర్ ముందట ధర్నా చేస్తామని, ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు అని అన్నారు.

కేసీఆర్ మీద కోపం ఉంటే రాజకీయంగా తలపడాలి, రైతుల మీద చూపించవద్దు అని,వారిని గోస పెట్టుకోవద్దని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 450 మంది రైతులను రేవంత్ రెడ్డి పొట్టన పెట్టుకున్నాడని అన్నారు. కాంగ్రెస్ చెప్పిన రైతు డిక్లరేషన్ లో ఒక్క మాటను కూడా నిలబెట్టుకోలేదని, రైతు బంధును కూడా వెయ్యడం లేదని, ప్రభుత్వానికి కరెంటు నీళ్లు ఇచ్చే తెలివి లేదని అన్నారు.ప్రస్తుతం మిడ్ మానేరులో 16 టీఎంసీల నీళ్లు ఉన్నాయి, ఒక్క టీఎంసీ నీళ్లను మల్కపేట రిజర్వాయర్కు వదిలిపెట్టాలని కోరుతున్నా, తాగునీటి అవసరాలకు మూడు టీఎంసీలు మాత్రమే కావాలి,తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాదు ఇంకా 13 టిఎంసిల నీళ్లు మిడ్ మానేరు లో ఉంటాయని, రైతులకు నీళ్లు విడుదల చేయకపోతే అన్నదాతలతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు.



## సహాయక చర్యలకు 2,3 రోజులు పడుతుంది



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పరిశీలన

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తరహా ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ఘటన కేస్ స్టడీగా తీసుకోవాలన్నారు. ఈ ఘటన ఓ విపత్తు.. ఓ ప్రమాదమని ఆయన అభివర్ణించారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనను ఆయన పరిశీలించారు. ఆ క్రమంలో టన్నెల్‌లోకి సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారు. సహాయక చర్యలపై ఉన్నతాధికారులను ఆయన ఆరా తీశారు. అలాగే సహాయక చర్యలపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.

అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. టన్నెల్‌లో బాధితులను రక్షించే పని కొలిక్కిరావడానికి మరో 2, 3 రోజులు పడుతుందన్నారు. కన్వేయర్ బెల్ట్ పని చేయక పోవడంతో.. మట్టి తరలించడం ఇబ్బందిగా మారిందన్నారు. ఈ ఘటన జరిగిన నాటి నుంచి ఎప్పటికప్పుడు తాను సమీక్ష నిర్వహించానని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ ఆపరేషన్ కొనసాగాలన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదాన్ని రాజకీయం చేయడం తగదని ప్రతిపక్షాలను ఆయన హితవు పలికారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు ఈ ప్రాజెక్టును పక్కన పెట్టిందని గుర్తు చేశారు. అంతేకాదు.. ఈ పనులు చేపట్టిన సంస్థకు గత ప్రభుత్వం.. బిల్లులు సైతం చెల్లించలేదని తెలిపారు. పనులు చేస్తున్న సంస్థ బిల్లులు చెల్లించలేదని.. దీంతో విద్యుత్ సరఫరా కూడా ఆపేశారన్నారు. అలాగే బోరింగ్ మిషన్‌కు విడిభాగాలు కూడా సమకూర్చలేదని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. పనులు జరుగుతోండగా.. అనుకోకుండా జరిగిన ప్రమాదం ఇదని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీశైలం పవర్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం సంభవించిందని.. ఈ ప్రమాదంలో ఆరుగురు మరణించారని ఈ గుర్తు చేశారు. ఆ సమయంలో తాను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నానని.. అయితే ఈ ప్రమాద ఘటన స్థలికి వెళ్తామంటే నాటి ప్రభుత్వం అనుమతించ లేదన్నారు. పనులు చేస్తున్నప్పుడు దురదృష్టవశాత్తూ జరిగిన ఘటన ఇదని తెలిపారు. సీఎం వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి తదితరులు ఉన్నారు.

## వైద్యులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దు..



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ఆసుపత్రిలో... అకస్మిక తనిఖీ....

**బలగం టీవీ , సిరిసిల్ల**

రోస్టర్ లో ఎంత మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు, ఆసుపత్రిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని వైద్యులు, సిబ్బందిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అడిగి తెలుసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ, జనరల్, ప్రసూతి, ఆర్థో, పిడియాట్రిక్, సర్జికల్ వార్డులను, ఇతర అన్ని విభాగాలను కలెక్టర్ కలియతిరిగి రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రతీ వార్డులో ప్రస్తుతం ఎంత మంది పేషెంట్లు ఉన్నారు? వారికి ఏ విధంగా వైద్య సేవలు అందిస్తున్నారు? వారి ఆరోగ్య పరిస్థితి ఏమిటి అనే వివరాలను క్షుణ్ణంగా ఆరా తీశారు.

ప్రభుత్వ ఆసుపత్రుల మీద నమ్మకంతో రోగులు అనారోగ్యంతో సుదూర ప్రాంతాల నుండి ఆసుపత్రికి వస్తారని, వారికి అన్ని రకాలుగా భరోసా కల్పించి, మెరుగైన, అత్యుత్తమైన వైద్యం అందించడం ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బంది కర్తవ్యమని అన్నారు. లివర్ సమస్యతో బాధపడుతున్న ఒక రోగి పరిస్థితి వైద్యం అందించినా కూడా మెరుగుపడలేదని కుటుంబసభ్యులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే హైదరాబాద్ పంపించి మెరుగైన వైద్యం అందించేలా చూడాలన్నారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, ప్రతి నిత్యం పర్యవేక్షణ చేయాలని ఆసుపత్రి పర్యవేక్షకులు లక్ష్మీనారాయణ ను కలెక్టర్ ఫోన్ ద్వారా ఆదేశించారు. రోగుల బంధువులు, అటెండర్లతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి ఇక్కడ అందిస్తున్న వైద్యం బాగుందా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయాఅని ఆరా తీశారు.

## ఉపాధ్యాయుల భోధన ఏ విధంగా ఉంది..?





- ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు చదువే ఆయుధం
- మెరుగైన ఫలితాల కోసం విద్యార్థులు నిత్యం సాధన చేయాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట**

విద్యాలయంలోని ప్రతీ తరగతి గదిని సందర్శించి, విద్యార్థులను ఏమైనా సమస్యలు ఉన్నాయా, భోజనం ఎలా ఉంది, ఉపాధ్యాయుల భోధన ఏ విధంగా ఉంది అని వివరాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా విద్యార్థుల ను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలోని తరగతి గదులు, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, టాయిలెట్స్, మైదానం, విద్యార్థులకు కల్పిస్తున్న ఇతర మౌలిక వసతులు, సదుపాయాల తీరును కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానికి అనుగుణంగా ముందుకు సాగాలని, చదువే సమాజంలో విలువైన, అత్యుత్తమైన ఆయుధమని తెలిపారు. విద్యార్థులు చదువులో రాణించి, తమ తల్లిదండ్రుల పేరును నిలబెట్టాలని, చదువును మించిన ఆయుధం లేదని, కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని, పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమంగా రాణించాలని, మెరుగైన ఫలితాలు రావాలంటే ప్రతినిత్యం సాధన చేయాలని సూచించారు. విద్యార్థులకు అత్యుత్తమ భోధన అందిచడంతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలను కల్పించాలని అధికారుల ను ఆదేశించారు. డైనింగ్ హాల్ ను సందర్శించి, భోజన తయారీ విధానాన్ని, స్టోర్ రూమ్ నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యాలయం పరిసరాల్లో ఉన్న గడ్డిని తొలగించి, మొత్తం శుభ్రం చేయించాలని గ్రామ పంచాయితీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ తనిఖీలో విద్యాలయం ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

## శ్రీపాదరావు సేవలు మరువలేనివి..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీ పాదరావు సేవలు మరువలేనివని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొనియాడారు. ఆదివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీస్ ఆద్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు చిత్రపటానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, వివిధ శాఖల జిల్లా అధికారులు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## అజేయంగా సెమీస్‌కు భారత్




**బలగం టీవీ, హైదరాబాద్**

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమిండియా జైత్రయాత్ర కొనసాగుతోంది. గ్రూప్ స్టేజీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడకుండా ఇండియా సెమీస్‌కు చేరుకుంది. న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 44 పరుగుల తేడాతో విజయం సాధించింది. దాంతో సెమీస్‌లో ఆస్ట్రేలియాతో టీం ఇండియా తల పడనున్నది.

ముందుగా బ్యాటింగ్ చేసిన టీం ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 249 పరుగులు చేసింది. టీం ఇండియా సారధి రోహిత్ శర్మ 15, విరాట్ కోహ్లీ 11 పరుగులకే పెవిలియన్ బాట పట్టినా శ్రేయస్ అయ్యర్(98 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 79) హాఫ్ సెంచరీతో రాణించగా.. అక్షర్ పటేల్(61 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 42), హార్దిక్ పాండ్యా(45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 45) కీలక ఇన్నింగ్స్ ఆడారు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ(5/42) ఐదు వికెట్లు తీయగా.. కైల్ జెమీసన్, విల్ రూర్కీ, మిచెల్ సాంట్నర్, రచిన్ రవీంద్ర తలో వికెట్ తీసారు.

అనంతరం న్యూజిలాండ్ ఓవర్లలో 45.3 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌటై ఓటమిపాలైంది. కేన్ విలియమ్సన్(120 బంతుల్లో 7 ఫోర్లతో 81) మినహా మరే బ్యాటర్ రాణించలేదు. వరుణ్ చక్రవర్తి(5/42) ఐదు వికెట్లతో న్యూజిలాండ్ పతనాన్ని శాసించగా.. కుల్దీప్ యాదవ్(2/56) రెండు వికెట్లు పడగొట్టాడు. హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా తలో వికెట్ తీసారు.కివిస్ ఓపెనర్లు విల్ యంగ్, రుచిన్ రవీంద్రల్లో రవీంద్రను ఆరు పరుగులకే హార్దిక్ పాండ్యా బౌలింగ్లో అక్సర్ పటేల్ క్యాచ్ పట్టి పెవిలియన్ బాట పట్టించాడు. అటుపై 49 పరుగుల వద్ద వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో విల్ యంగ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత వన్ డౌన్ బ్యాటర్‌గా వచ్చిన కేన్ విలియమ్సన్ .. సహచర బ్యాటర్లు ఔటవుతున్నా నిలకడగా ఆడుతూ 81 పరుగులు చేశాడు. కానీ 41వ ఓవర్‌లో అక్షర్ పటేల్ వేసిన చివరి బంతిని కేఎల్ రాహుల్‌కు క్యాచ్ ఇచ్చి కేన్ విలియమ్సన్ ఔట్ కావడంతో కివిస్ ఆట కట్టించారు. డెరిల్ మిచైల్, టామ్ టాథమ్, గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ బ్రేస్ వెల్ ఎల్‌బీడబ్ల్యూ అయ్యారు. భారత్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి ఐదు వికెట్లు, కుల్దీప్ యాదవ్ రెండు, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ ఒక్కో వికెట్ తీశారు.